

# వెండితెర సాక్షిగా

- జీడిగుంట రామచంద్రమూర్తి



## *వేషం కావాలంటే ఇదీ ఓ పద్ధతే!*

**'పట్టు పరిశ్రమ'** గురించి మీరు వినే వుంటారు.

ఈ పరిశ్రమ చాలా లాభదాయకమైందనీ, ఎవరైనా సరే దీన్ని ప్రారంభించవచ్చుననీ, అధిక మొత్తాలు పెట్టుబడులు అవసరంలేదనీ, ఎటొచ్చీ ఈ పరిశ్రమను చేపట్టేవారికి కాస్తంత ఓపికా, నేర్పూ వుండాలనీ, ఆ రెండూ వుంటే ఎంతో లాబం వస్తుందనీ రేడియోలోనూ, టీవీలోనూ చెప్పగా మీరు విని వుంటారు వదిలెయ్యండి.

నేను చెప్పబోయేది 'మరో రకం పట్టు పరిశ్రమ' గురించి. ఈ పరిశ్రమలో మనకు వుపయోగపడే మనిషిని పదే పదే కలుసుకుంటూండాలి. ఆ మనిషి పుట్టినరోజెప్పుడో గుర్తుపెట్టుకుని ఆ రోజున ఫోన్లోనో పర్సనల్‌గానో శుభాకాంక్షలు చెప్పాలి. వీలైతే 'గుడ్ మార్నింగ్'ల దగ్గర్నించి 'గుడ్‌నైట్'ల వరకూ చెబుతూ మధ్య మధ్యలో వీలు కల్పించుకుని 'మీరు ఇంద్రుడు, మీరు చంద్రుడు' అని పొగడ్డల వర్షం కురిపించాలి. ఎప్పుడైనా ఆ మనిషి ఓ కుళ్ళు జోకువేసినా సరే మీరు పొట్టచెక్కలయ్యేలా ఫక్కున నవ్వాలి.

ఈ విధంగా 'కాకా' పట్టటం కూడా పట్టుపరిశ్రమగానే భావించబడుతుంది. మరీ నంబర్ వన్ - నంబర్ టూ స్థానాల్లో వున్నవారు మినహా - తక్కిన సినీతారలు చాలామంది ఈ పరిశ్రమను చేపట్టి - తమ స్థానాన్ని పదిలంగా కాపాడుకోవాలని తాపత్రయపడుతుంటారు. 'జీవితమంటే అంతులేని ఒక పోరాటం' అనే సినీగీతం పల్లవి - 'సినిమా జీవితానికే' అతికినట్లు వర్తిస్తుంది. సినిమాల్లో అడుగుపెట్టేదాకా ఒక ఆరాటం. ఆ తర్వాత అందులో నిలదొక్కుకునేదాకా ఒకటే పోరాటం.

పూర్వకాలంలో సినిమాల్లో నటించాలంటే అంతో ఇంతో రంగస్థల అనుభవం వుపయోగపడేది. చక్కటి వాచికాభినయంతోపాటు గాత్రంలో కూడా ప్రవేశం వుంటే ప్రాధాన్యత లభించేది. ఇవాళ పరిస్థితి అదికాదు. కొంచెం గ్లామరూ, మరికొంచెం చొరవా, ఇంకొంచం పరిచయాలూ వున్నాయంటే చాలు మీరు సినిమాల్లో చేరిపోవచ్చు.

వాచికాభినయం లేదంటారా? నో ప్రాబ్లం. మగాళ్ళ గొంతు ఆడవారి కంఠస్వరంలా వున్నా ఆడవారి గొంతు మగవారి కంఠస్వరంలా వున్నా ఇక్కడ నో ప్రాబ్లం. శుభ్రంగా చెల్లిపోతుంది. ఎందుకంటే అలాంటివారిని ఆదుకుని ఓ మెట్టుపైకి ఎక్కించటానికి రోజారమణులూ, సరితలూ, దుర్గలూ, సాయికుమార్లూ, రత్నకుమార్లూ - ఇంకా ఎందరెందరో డబ్బింగ్ కళాకారులు వుండనే వున్నారు.

వారి పుణ్యమా అని 'వాచికాభినయం' విషయంలో మీకు ఎలాంటి ఇబ్బందీ వుండదు. కెమేరాముందు నిలబడి 'యాక్షన్' అని డైరెక్టరుగారు చెప్పగానే మీరు 'ఓ నమః శివాయ' అంటూ మీకు వచ్చిన భాషలో నచ్చిన మంత్రాలు చదివేయండి చాలు. ఆనక అంతా డబ్బింగ్ కళాకారులు చూసుకుంటారు. మీ పాత్రకు మంచి డైలాగులు 'రైటరు' రాశాడనుకోండి వాటిని డబ్బింగ్ కళాకారులు అద్భుతంగా చెప్పారనుకోండి - అపుడు మీకు అవార్డులు కూడా రావచ్చు. ఆ డబ్బింగ్ కళాకారుల పేరైనా నా తెరమీద కనిపించదు కనుక అదంతా మీ ప్రతిభే అనుకుంటారు చాలామంది. ఇకపోతే అలా ఒకటి రెండు సినిమాల్లో నటించాక ఓ మంచిరోజు చూసుకుని

పత్రికలవారిని పిలవండి. మంచి పార్టీ ఇవ్వండి. పార్టీ ఎందుకని అడిగితే మీ పుట్టినరోజని చెప్పండి. దట్సాల్. ఇక మీ గురించీ మీ నటనా కౌశలం గురించీ పత్రికలన్నీ రాస్తాయి.

పరిశ్రమలో పదికాలాలపాటు పదిలంగా వుండాలంటే పట్టుపరిశ్రమ ఒక్కటే మార్గమని నమ్మిన ఓ తారామణి ఇటీవల ఆ మార్గంలో మరో అడుగుముందుకు వేసింది. (ఉత్తరాదినో, దక్షిణాదినో అడక్కండి)

ఆ తారామణి పేరు గీర్వాణి. మంచి వయసులో వున్నపుడే పరిశ్రమలో కాలు పెట్టింది. కానీ కాలం కలసిరాలేదు. ఎప్పుడూ సెకండ్ హీరోయిన్ వేషమో, చెల్లెలు వేషమో లభిస్తుండేది. పట్టుపరిశ్రమలోని ప్రథమాధ్యాయాన్ని విజయవంతంగా ఆచరణలో పెట్టిన తర్వాత కాస్తంత ప్రాధాన్యత కలిగిన వేషాలు రావటం ప్రారంభించాయి.

ఆ సమయంలో ఓసారి ఓ పెద్ద హీరో పక్కన గీర్వాణికి హీరోయిన్‌గా నటించే అవకాశం లభించింది. షూటింగ్ జరుగుతోంది. ఆ చిత్రానికి డైలాగ్స్ రాసిన 'సుందర్ లాల్' కూడా ఆ రోజు షూటింగ్‌కి వచ్చాడు.

'డైలాగ్‌రైటర్‌గా' సుందర్ లాల్‌కి అప్పటికే ఇండస్ట్రీలో మంచి పేరుంది. ఎస్పీ బాలసుబ్రమణ్యం తమకు ప్లేబాక్ పాడాలని ఇవాల్టి హీరోలంతా ఎలా కోరుకుంటారో - తమ పాత్రకు 'సుందర్‌లాల్' డైలాగ్స్ రాయాలనికూడా నటీనటులందరూ ఆశపడుతుంటారు. షూటింగ్ అవుతున్నంతసేపూ షాట్‌కి, షాట్‌కీ మధ్య కాస్తంత సమయం దొరికినప్పుడల్లా ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్న డైరెక్టరు సుందర్‌లాల్‌తో మాట్లాడుతూండటం గీర్వాణి గమనించింది. కానీ 'సుందర్‌లాల్'ని ఆమె ఎప్పుడూ చూడలేదు. అందుకే పక్కనున్న హీరోని అడిగింది. 'ఆయనెవరూ?' అని. "ఈ పిక్చర్‌కి స్టోరీ, డైలాగ్ రైటర్ ఆయనే" అని చెప్పాడు హీరో.

ఆ తర్వాత అయిదు నిమిషాలకే తన షాట్ అయిపోయాక గీర్వాణి సుందర్‌లాల్ దగ్గరకు వెళ్ళింది. 'హలో' అంటూ చిరునవ్వుతో పలకరించింది. అతను కూడా అరనవ్వుతో బదులు పలకరించి, పక్కనున్న కుర్చీ చూపించాడు. "మీ పేరు వినటమే కానీ - ఎప్పుడూ చూడలేదు మిమ్మల్ని ఇప్పుడే హీరోగారు చెప్పారు. మీకు థాంక్స్ చెప్పుకోవాలని వచ్చాను" అదే చిరునవ్వు కంటిన్యూ చేస్తూ చెప్పింది. అర్థంకాలేదు సుందర్ లాల్‌కి. "ఎందుకూ?" అన్నాడు అమాయకంగా.

"నా వేషానికి మంచి డైలాగ్స్ రాసినందుకు అసలు మీ డైలాగ్సంటే నాకు మహా ఇష్టం. ఇన్ని సినిమాల్లో నేను నటించినా ఇంతవరకూ మీరు డైలాగ్స్ రాసిన దాంట్లో నాకు అవకాశం రానందుకు అప్పుడప్పుడు చాలా వర్రీ అవుతూండేదాన్ని. ఇన్నాళ్ళకు నాకోరిక తీరింది" గలగలా ఆమె మాట్లాడేస్తుంటే గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు సుందర్‌లాల్.

"మీరు రాత్రిళ్ళు కూడా బిజీగా వుంటారా?" షూటింగ్ అయిపోయిన తర్వాత కూల్‌డ్రింక్ తాగుతూ - సుందర్‌లాల్ దగ్గరకు మళ్ళీ వచ్చి అడిగింది గీర్వాణి.

"అంటే?" అర్థంకాలేదు. "మరేం లేదు. సాయంత్రం మీకేమీ ఎంగేజ్‌మెంట్ లేకపోతే - మా ఇంటికి రండి"

"ఏదైనా అకేషనా?" అడిగాడు సుందర్‌లాల్. "మీరు మా యింటికి రావటమే అకేషన్" ఒయ్యారాలు సగం అక్కడే వలకబోస్తూ చెప్పింది గీర్వాణి. సుందర్‌లాల్ రచయిత కనక రవి గాంచనిది కూడా కనుక 'పాయింటు' అర్థం చేసుకున్నాడు. ఆరయ్యేసరికి ఆ ఇంటి గుమ్మం హాజరై బజర్ నొక్కాడు.

"ఓ! వచ్చేశారా మీరు చాలా బిజీ రైటరు ఈ మామూలు ఆర్టిస్టు ఇంటికి వస్తారో రారో అని అనుమానించాను" లోపలకు ఆహ్వానిస్తూ అంది గీర్వాణి.

"నేను బిజీరైటర్ని అయితే. కానీ మీరు 'మామూలు ఆర్టిస్టు' అంటే మాత్రం నేనొప్పుకునేదిలేదు" ఓ తస్సావేశాడు సుందర్‌లాల్.

ఆమె తనను ఎందుకు ఆహ్వానించిందీ అతనికి తెలుసు. అతనెందుకు వచ్చిందీ ఆమెకూ తెలుసు. కానీ ఒకరికొకరు దొరక్కుండా కాసేపు దొంగాట ఆడుకున్నారు.

"అవునూ! ఇంట్లో మీరొక్కరే వున్నట్టున్నారు. మీ వారు!?" తాపీగా సిగరెట్ వెలిగించుకుంటూ అడిగాడు సుందర్‌లాల్. ‘లేరులెండి‘ ధైర్యం చెప్తున్నట్టుగా అందామె. లేరని సుందర్‌లాల్‌కీ తెలుసు. అయినా అడగటం తన సంస్కారమనుకున్నాడు. అడిగి ఔననిపించుకున్నాడు.

"మీరేం తీసుకుంటారు?"

"మీరేం ఇచ్చినా సరే!"

"అబ్బా! చమత్కారులే ఎలా అయినా రైటర్లు కదా! డబల్ మీనింగ్ డైలాగులు రాసిరాసి" గలగలా నవ్వేసింది.

"ఇంతకీ ఏం ఇస్తారు?" వెంటనే అడిగాడు.

"మీరేం కావాలన్నా సరే" అదే నవ్వు.

"అమ్మో! మీరూ చతురులే" మెచ్చుకోలుగా అన్నాడు సుందర్‌లాల్. గీర్వాణి లేచి పక్క గదిలోకి వెళ్ళి మరో అయిదునిమిషాల్లో తిరిగివచ్చింది. ఇప్పుడామె చేతిలో ఓ అందమైన ‘ట్రే‘ వుంది. ఆ ట్రేలో ఖరీదైన విస్కీబాటిల్ వుంది. దాని పక్కనే అయిస్ క్యూబ్స్ వున్న ప్లాస్టిక్ బకెట్ వుంది. "ఆ మధ్య మా ప్రొడ్యూసర్‌గారు సింగపూర్ వెళ్ళినపుడు ఈ బాటిల్ తెచ్చారు. నేను అట్టే తీసుకోను. ఎవరైనా ఆనరబుల్ గెస్ట్స్ వచ్చినప్పుడు ‘సెర్వ్‘ చేయమని దాచాను. ఇవాళ ఇలా సద్వినియోగపడింది" అంటూ బాటిల్ ఓపెన్ చేసిందామె.

ఆ రాత్రి పదకొండుగంటలదాకా తాగిన తర్వాత ఇంటికి ఫోన్ చేసి "ఇవాళ నేను ఇంటికి రావటంలేదు" అని భార్యకు చెప్పాడు సుందర్‌లాల్. ఈ సంఘటన జరిగిన తర్వాత గీర్వాణికి సుందర్‌లాల్ కథ రాసిన చాలా చిత్రాల్లో చాలా మంచి వేషాలు వచ్చాయి. ఆమె రేటు కూడా బాగా పెరిగింది.

అయితే ఆమెకు వచ్చే పారితోషకంలో నాలుగోవంతు సుందర్‌లాల్ తీసుకుంటాడన్న నిజం చాలాకాలం ఎవరికీ తెలియలేదు. ఇది ‘పట్టుపరిశ్రమ‘లో ఒక ‘నూతన అధ్యాయం‘ అని ఒప్పుకుంటారా లేదా?

*(వచ్చేనెల మరో కథనం)*

Post your comments

*(పాతికేళ్ళ క్రిందట సితారలో ధారావాహికగా వచ్చిన ఈ కథనాలు రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)*